సాక్షి
వికారాబాద్

ఆదివారం । 5 । మే । 2024



వైభవంగా రథోత్సవం

తాండూరులోని భావిగి భద్రేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. 10లో▸



అక్రమ కేసులు ఎత్తివేయండి

బాధితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి కోరింది. 10లో▸



కాంగ్రెస్ అంటేనే కరువు

కాంగ్రెస్ అంటేనే కరువు, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. 11లో▸

బీఆర్ఎస్‌కు షాక్

అనంతగిరి: వికారాబాద్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సన్నిహితులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. స్పీక ర్ ప్రసాద్‌కుమార్ నివాసంలో పార్టీ పట్టణ అ ధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు, పీఏ సీఎస్ చైర్మన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు వారి అనుచ రులు కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో పుష్పలతారెడ్డి, సురేష్, సువర్ణ, మంజు లరెడ్డి, నవీన్, రాజమల్లు, ముత్యంరెడ్డి, హఫీజ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రమేష్, బుచ్చిబాబుగౌడ్, నర్సింలు, శ్రీనివాస్ ఉన్నా రు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నా యక్, రెడ్యానాయక్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు

సమన్వయంతో పని చేయండి

- కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్‌లో పోస్టల్ ఓటు వేస్తున్న ఉద్యోగి, పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి/పరిగి: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించ రాదని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. శనివారం వికారాబాద్, పరిగి పట్టణాల్లో ఓపీఓల శిక్షణ కార్యక్రమాన్ని, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధానాన్ని అడి షనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హార తితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేందుకు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే ఎన్నికల సంఘం రూపొందిం చిన హ్యాండ్ బుక్ చూసి నివృత్తి చేసుకోవాలన్నారు. చేవెళ్ల లోకసభ ఎన్నికల్లో 43 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, వీరి కోసం మూడు బ్యాలెట్ యూనిట్లను కేటా యించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సామగ్రి తీసు కెళ్లింది మొదలు తిరిగి అప్పగించే బాధ్యత సిబ్బందిదే అన్నారు. విధి నిర్వహణలో నిర్ల క్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం పట్టణంలోని మేరీ నాట్స్ స్కూ ల్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించా రు. వికారాబాద్, పరిగి కార్యక్రమాల్లో ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనీ వీరకాంతం, ఏఆర్ఓ వాసుచంద్ర, తహసీలార్లు లక్ష్మీనారాయణ, ఆనం ద్‌రావు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ పూర్తి

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శనివారం తాండూరు నియోజకవర్గంలో హోం ఓటింగ్ నిర్వహిం చారు. 41 మందికి గాను 24 మంది వృద్ధులు, 16 మంది దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్దే ముల్ మండలంలో వారం రోజుల క్రితం ఒక వృద్ధుడు చనిపోయినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస రావు తెలిపారు

క్లుప్తంగా

బైక్‌లు తరలిస్తున్న వాహనం దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పూడూరు: బైక్‌లు తరలిస్తున్న వాహనం దగ్ధమైన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తాండూరు వైష్ణవి బైక్ షోరూం నుంచి నాలుగు ద్విచక్రవాహనాలను డీసీఎంలో కొండాపూర్‌కు తరలిస్తున్నారు. మండల పరిధిలోని కండ్లపల్లి గేట్ సమీపంలో వాహనంలో మంటలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ చింటు రాములు వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.89వేల విలువైన మద్యం సీజ్



పోలీసులు సీజ్ చేసిన మద్యం

అనంతగిరి: రైలులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈనెల 3న అర్ధరాత్రి వాస్కోడిగామా రైలులో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. పలు బ్యాగుల్లో తరలిస్తున్న 86 బాటిళ్లను (24.26లీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.89,112 ఉంటుందని ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

పంటకు నిప్పంటించిన దుండగులు

యాలాల: గుర్తు తెలియని దుండగులు వరి పంటకు నిప్పంటించడంతో చేతికొచ్చిన పంట కాలిబూడిదయింది. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని ముద్దాయిపేటలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పాలేపల్లి రమేశ్ మూడెకరాల్లో వరి సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పటించడంతో పంట కాలి బూడిదయింది. విషయం తెలుసుకున్న రైతులు పొలం వద్దకు చేరుకుని మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పేశాడు. సుమారు పది క్వింటాళ్ల వరకు ధాన్యం కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కుల్కచర్ల: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పోలీసులకు ఎదురుపడింది. డ్రైవర్‌ను అనుమతి పత్రాలు చూపమనడంతో లేవని సమాధానం ఇచ్చాడు. దీంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంట్రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా రథోత్సవం

- కనులపండువగా కలశ శోభాయాత్ర
- భక్తజన సంద్రమైన తాండూరు

తాండూరు: పట్టణంలోని భావిగి భద్రేశ్వరస్వామి ఆలయ జాతర బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ, మధ్యాహ్నం రథంపై ప్రతిష్ఠించే కలశాన్ని శరణు బసవేశ్వరస్వామి దేవాలయం నుంచి స్వామివారి ఆలయం వరకు కలశంతో శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి రథం వద్ద స్థానిక ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు భక్తుల సమక్షంలో కలశ పూజ చేశారు. అనంతరం కలశాన్ని రథంపై ప్రతిష్ఠించారు.

▲ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన రథోత్సవ వేడుకలు శనివారం రాత్రి గంటలకు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మంగళవాయిద్యాలు, భజన సంకీర్తనల నడుమ ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొచ్చి స్వామి వారిని ప్రతిష్ఠించారు. మొదట పూర్ణకుంభం, మహామంగళ హారతి, అనంతరం భక్తులు స్వామి వారి రథాన్ని ముందుకు కదిలించారు. వేలాది మంది భక్తుల సమక్షంలో బస్వణ్ణ కట్ట వద్ద వరకు రథోత్సవం జరిగింది. పూజలు చేసిన అనంతరం తిరిగి రథాన్ని యథాస్థానానికి చేర్చారు. ఈ ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు రమేష్ మహారాజ్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతాసంపత్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మురళీ కృష్ణగౌడ్, యు.రమేష్ కుమార్, పట్లోళ్ల నర్సింహులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులున్నారు.



ముస్తాబైన రథం



బ్రహ్మోత్సవాల్లో భక్తుల సందడి



కలశ ఊరేగింపులో భక్తులు

ఓటుతోనే భవితకు నాంది



అవగాహన సమావేశంలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు

- జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ

అనంతగిరి: ఓటుతోనే భవితలో మార్పు వస్తుందని.. ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళ, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ, స్వీప్ సంయుక్తంగా వయోవృద్ధులకు, దివ్యాంగులకు, ట్రాన్స్‌జెండర్లకు లోక్‌సభ ఎన్నికలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిపద్మ మాట్లాడుతూ.. మే 13న నిర్వహించే ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద వీల్ చైర్స్, ర్యాంపుల సౌకర్యాలు కల్పించామని అలాగే వయోవృద్ధులకు, దివ్యాంగులకు ఓటు వేయడానికి ఉచిత రవాణా సదుపాయంతో పాటు వీరికి సహాయంగా వలంటీర్లను సైతం ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగులకు, వయోవృద్ధులకు పోలింగ్ బూత్‌ల వద్ద వేర్వేరు లైన్‌లున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి సత్తార్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు మురారి, ట్రాన్స్‌జెండర్స్ జిల్లా అధ్యక్షులు హరిజన్ రమ్య, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ బలరాం, ట్రాన్స్‌జెండర్స్ స్పెషలిస్ట్ వరలక్ష్మి, బాబు, జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మెరుపురి వెంకటేశ్, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

రూ.58.86 లక్షలు సీజ్

ఇబ్రహీంపట్నం రూరల్: రశీదు లేకుండా తరలిస్తున్న నగదును శనివారం పోలీసులు సీజ్ చేశారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో శ్రీశ్రీ ఏరోసిటీ సమీపంలో ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేశ్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నాడు. ఓ వాహనంలో భారీగా నోట్ల కట్టలు గుర్తించి లెక్కించగా రూ.58.86లక్షలున్నాయి. డబ్బు తరలిస్తున్న పల్లె శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని నగదును సీజ్ చేశారు. సీఎంఎస్ కంపెనీ నగదుగా గుర్తించిన పోలీసులు రసీదు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు.

ముందస్తు ఓటేసిన ఉద్యోగులు



పోస్టల్ ఓటుకు హాజరైన ఉద్యోగులు



ఓటేసినట్లు చూపుతున్న పోలీసులు

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస రావు

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలోని నంబర్-2 ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 280 మంది సిబ్బంది ఓటు వేశారన్నారు. ఈ నెల 8వరకు ఓటేసే అవకాశం ఉందన్నారు.

కొడంగల్ ఠాణా సిబ్బంది

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో శనివారం సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ భరత్‌రెడ్డి, కొడంగల్ ఠాణా సిబ్బంది పలువురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ముఖ్యమంత్రి ముక్కు నేలకు రాయాలి

- ఆరు గ్యారంటీల పేరిట మోసం
- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఎంపీలుగా చేసిందేమీ లేదు
- 'కారు'కు ఓటేసి సారుకు బలమిద్దాం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

నవాబుపేట: డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తా అని మాట ఇచ్చి రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలని మాజీ మంత్రి సబితారెడ్డి నిలదీశారు. శనివారం ఆమె మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ప్రచార సమావేశంలో మాట్లాడుతూ.. అమలు కాని ఆరు గ్యారంటీల పేరుతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. రుణమాఫీ, రైతు బంధు ఊసే లేదు.. పింఛన్ల పెంపు.. మహిళలకు 2,500 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పనిచేసేవారు దేవుళ్లపై ఒట్టు పెట్టరంటూ విమర్శించారు. కేసీఆర్ అధికారంలో ఉంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల వచ్చేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులిద్దరిని కేసీఆర్ ఎంపీలుగా గెలిపిస్తే విశ్వాస ఘాతుకం చేశారన్నారు. ప్రజలు వారికి కర్రుకాల్చి వాతపెట్టాలన్నారు. ఈ ప్రాంత కష్టసుఖాలు తెలిసిన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడతాడన్నారు. కాసాని గెలుపుతో కేసీఆర్‌కు బలం ఇచ్చిన వాళ్లం అవుతామన్నారు. మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు పోయి కార్పొరేట్ సంస్థల రాజ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెజ్ బోర్డు చైర్మన్ నారాయణ, జెడ్పీటీసీ జయమ్మ, ఎంపీపీ భవాని, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దయాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాయకులు భరత్‌రెడ్డి, బల్వంత్ రెడ్డి, అజయ్‌కుమార్, దాస్‌గౌడ్, దర్శన్, శివరాజ్, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయండి

పరిగి: నిందితులను తప్పించేందుకు బాధితులపై పెట్టిన కేసులు ఎత్తివేసి వారికి న్యాయం చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆలిండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో న్యాయపోరాట సంఘీభావ కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. గండీడ్ మండలం పగాడ్యాల గ్రామానికి చెందిన రామాంజనేయులు ఆత్మహత్యకు కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మృతుడు గ్రామంలో ఓ వ్యక్తి దగ్గర పని చేస్తుంటే ఆయనకు రావాల్సిన జీతం డబ్బులు ఎగ్గొట్టేందుకు డీజిల్ దొంగతనం చేసినట్లు దుష్ప్రచారం చేయడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఆత్మహత్యకు కారకులైన వారిపై కేసు పెట్టకపోగా బాధితులపై కౌంటర్ కేసులు నమోదు చేయడంతో వారు ప్రశ్నించారు. ఎమ్మెల్యే బాధితులకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

రేపు బీజేవైఎం యువ సమ్మేళనం

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 6న కల్వకుర్తిలో బీజేవైఎం ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్ తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గ బీజేపీ అభ్యర్థి భరత్‌కు మద్దతుగా యువసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండె సాయి, కల్వకుర్తి బీజేవైఎం ఇన్‌చార్జి పద్మఅనిల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సందీప్, ధన్‌రాజ్, మహేశ్‌యాదవ్, అజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8 వరకు పోస్టల్ ఓటు



ముందస్తు ఓటింగ్‌కు వచ్చిన ఉద్యోగులు

- చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలో హోమ్ ఓటింగ్, పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 15 మంది హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 8వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. హోమ్ ఓటింగ్‌కు నియోజకవర్గ పరిధి నుంచి 342 మంది వృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.



హోమ్ ఓటింగ్‌లో పోలింగ్ అధికారులు, పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ సాయిరాం

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చేవెళ్ల: గుర్తు తెలియని వ్యక్తి పడుకున్న చోటే మృత్యుఒడికి చేరుకున్నాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమ్మెర గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని పొలాలకు వెళ్తున్న స్థానికులు చెట్టు కింద ఎవరో పడుకుని ఉండడాన్ని గుర్తించారు. పిలిచిన పలకకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడిని గుర్తిస్తే సమాచారం చేవెళ్ల ఠాణాలో సంప్రదించాలన్నారు. పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

యువకుడి మృతి



సురేశ్ మృతదేహం

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా గ్రీపురం గ్రామానికి చెందిన సురేశ్(25) టైల్స్ వేస్తుంటాడు. ఆయన కుటుంబంతో కలిసి కొత్తూరులో నివసిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున తిమ్మాపూర్ గ్రామంలోని చేగూరు కూడలిలో జాతీయ రహదారిపై సురేశ్ ప్రయాణిస్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనితను చంపేస్తా.. బెయిల్‌పై వస్తా

- రెండో పెళ్లికి అడ్డొస్తోందని భార్య హత్య
- మహిళ అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: మహిళ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను శనివారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వెల్లడించారు. చంద్రవంచకు చెందిన బోయిని లక్ష్మప్ప, అనిత(35) దంపతులు. లక్ష్మప్ప రోజు తాగి వచ్చి భార్యను చిత్ర హింసలు పెడుతున్నాడు. ఇదే విషయం మృతురాలు పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. అప్పటికీ ఆయన తీరుమారలేదు. నెల క్రితం భార్య తరపున బంధువు రాముకు ఫోన్ చేసి అనితను చంపేస్తా.. మళ్లీ బెయిల్‌పై వస్తానని చెప్పాడు. ఏప్రిల్ 30న దంపతులు జట్టూరు జాతరకు వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరూ చంద్రవంచ వాగు వద్ద మద్యం తాగారు. అనిత మత్తులో ఉండగా అదునుగా భావించిన భర్త కత్తితో గొంతు కోశాడు. చనిపోయినట్లు నిర్ధారించుకుని వాగులో పడేసి వెళ్లిపోయాడు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి అనుమానాస్పద కేసు నమోదు చేసిన పోలీసులు మృతురాలు అనితగా గుర్తించారు. అనంతరం తండ్రి తుల్జప్పకు సమాచారం అందించగా.. కూతురును అల్లుడు చంపాడని ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న లక్ష్మప్పను పోలీసులు పట్టుకుని విచారించగా.. రెండో వివాహానికి అడ్డు వస్తోందని తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడని డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో రూరల్ సీఐ అశోక్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.

ప్రాణం తీసిన భూ వివాదం

మోమిన్‌పేట: దాయాదుల మధ్య తలెత్తిన భూవివాదం నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని టేకులపల్లికి చెందిన సయ్యద్ అస్గర్ అలీ అలియాస్ చోటేమియా హైమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న సిరాజొద్దీన్ (50) దాయాదులు. సిరాజొద్దీన్ పెద్దలు 20 ఏళ్ల క్రితం చోటేమియాకు భూమిని విక్రయించారు. ఆయన తరుచూ తమ కుటుంబీకులు తక్కువ ధరకే భూమి విక్రయించారని తనకూ వాటా వస్తుందనే వాడు. శుక్రవారం సాయంత్రం సైతం చోటేమియా ఇంటికి వెళ్లాడు. చోటేమియాకు చెందిన పశువుల కొట్టం వద్ద రాత్రి ఇద్దరూ కలిసి మద్యం తాగారు. కాగా.. తనకూ భూమి ఇవ్వాలని సిరాజొద్దీన్ కోరాడు. దీంతో వివాదానికి దారితీసింది. ఇద్దరి మధ్య మాటలు పెరగడంతో కోపోద్రిక్తుడైన చోటేమియా కర్రతో సిరాజొద్దీన్ తలపై కొట్టాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి కి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.



సిరాజొద్దీన్ మృతదేహం

ఎన్నికలకు సహకరించండి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలీస్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల, షాబాద్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మారెడ్డి, కాంతారెడ్డి, ఎస్‌ఐలు ప్రదీప్‌కుమార్, వీరబ్రహ్మం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు